పేదలందరికీ గూడు కల్పనే లక్ష్యం

- ఇళ్ల పట్టాల మంజూరు నిరంతర ప్రక్రియ
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారుకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

ఆనందపురం : రాష్ట్రంలో నివసిస్తున్న అర్హత గల పేదలందరికీ స్థలం ఇచ్చి గూడు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేములవలసలో సోమవారం పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది స్వార్థంతో, రాజకీయ లబ్ధి కోసం కోర్టుకు వెళ్లి ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకున్నారన్నారు. ఆ విషయాన్ని స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే, అధికార యంత్రాంగంతో మాట్లాడి పరిష్కరించామన్నారు. సుమారు రూ.80 కోట్ల విలువైన భూమిని ఇళ్ల స్థలాల రూపంలో పేదలకు అందించామని, అదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమేనని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉండాలన్నారు. గతంలో రుణమాఫీ, సున్నా వడ్డీ పేరుతో మహిళలను చంద్రబాబు మోసం చేశారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం అవినీతికి తావు లేకుండా లక్షలాది రూపాయల విలువైన స్థలాలను మహిళల చేతుల్లోనే పెడుతున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని కోరుకునే నాయకుల్లో జగన్ మోహన్ రెడ్డి ముందు వరసలో ఉంటారని చెప్పారు.

టీడీపీ నాయకులు సెల్ఫీలతో పోజులు కొడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాటిని నమ్మొద్దని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు వేములవలస పంచాయతీలో సంక్షేమానికి రూ.14కోట్లు, అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు వ్యయం చేశామని వివరించారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నామని, రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరలా ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేదల బతుకులకు భరోసా ఉంటుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ గత 20 ఏళ్లలో వేములవలసకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, ప్రస్తుతం ఒకేసారి 450 మందికి స్థలాలతోపాటు ఇళ్లు కూడా అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు దక్కుతుందని చెప్పారు. ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేసేది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ జాయింట్ కలెక్టర్ మాధవి, వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, తహసీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ సూర్యకుమారి, నాయకులు మజ్జి వెంకటరావు, కోరాడ అప్పలస్వామినాయుడు, కోన శ్రీను, కోరాడ రాంబాబు, గంగ్రెడ్డి శ్రీనివాస్, బొట్టా రామకృష్ణ, పిన్నింటి వెంకట రమణ, బీఆర్‌బీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

మధురవాడ: మధురవాడలోని చంద్రంపాలెం హైస్కూల్ సమీపంలో కమ్యూనిస్ట్ నాయకుడు నాగోతి సింగన్న జ్ఞాపకార్థం మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు సోమవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. దీనిని ఆయనతోపాటు ఎల్ ఎస్ నాయుడు, కార్యదర్శి ప్రదీప్ కుమార్ తదితరులు ఏర్పాటు చేసి పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు, ఎస్.బాబ్జి, బ్రిక్స్ శ్రీనివాస్, బెల్లాపు పాపారావు, పోలిశెట్టి నాగేశ్వరరావు, టి.జగన్‌మోహన్‌రావు, ఆశా స్వరూప్, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వీడీఎఫ్‌ఏ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ శిబిరం



శిక్షణ శిబిరంలో పిల్లలు, నిర్వాహకులు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో సోమవారం విశాఖ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. 11 నుంచి 14 ఏళ్లలోపు వయసు గల బాలబాలికలకు ఈ నెల 31 వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. కోచ్‌గా బోర చిన్నారెడ్డిని నియమించారు. శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు నమ్మి రాము, మంతెన రాంజీ, కంతిమహంతి మహేష్, అనకాపల్లి శివ, తమ్మిన హరగోపాల్, శొంఠ్యాన జడ్సన్ రాబర్ట్ సన్, కోల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'స్పందన'కు ఆరు వినతులు

భీమునిపట్నం: ఇక్కడి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు వచ్చాయి. వీటిని త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జెడ్సీ రాము తెలిపారు.

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 2 అర్జీలు వచ్చాయి. మే డే, వర్షం ప్రభావంతో స్పందన వెలవెలబోయింది. ఈ సందర్భంగా జెడ్సీ కనక మహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

త్రైత సిద్ధాంత జ్ఞాన ధర్మ ప్రచారం

ఆనందపురం : మండలంలో గంగసాని అగ్రహారం, మామిడిలోవ గ్రామాల్లో సోమవారం హిందూ జ్ఞాన ధర్మ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడారు. అనంతరం గ్రంథాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో పైడన్న, రావణ్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



మహిళలకు చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలిలోని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. అనంతరం 160 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి పాల్గొన్నారు.

ఎస్‌వోఎస్ పిల్లలకు క్రీడా సామగ్రి వితరణ

భీమునిపట్నం: భీమిలిలోని ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ పిల్లలకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా బొడ్డపాలెం సమీపంలోని హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతినిధులు సోమవారం క్రీడా సామగ్రి అందించారు. మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి ముఖ్య అతిథిగా హాజరై 110 మంది పిల్లలకు క్రికెట్ కిట్, వాలీబాల్స్, బాస్కెట్ బాల్, చెస్‌బోర్డు అందించారు. విలేజ్ డైరెక్టర్ రవీంద్రకుమార్, హార్బర్ స్కూల్ సీఈవో వై.రఘురాజు పాల్గొన్నారు.

జగనన్న బడిబాటకు సహకరించండి



విద్యార్థుల వార్షిక ప్రగతి పత్రాలు అందిస్తున్న బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు

తగరపువలస: తల్లిదండ్రులంతా 2023 – 2024 విద్యా సంవత్సరానికిగాను జగనన్న బడిబాటకు సహకరించాలని జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. సోమవారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్, నాగమణి, మల్లిక మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభం రోజున జగనన్న విద్యాకానుకలు అందిస్తామని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు నాంది ట్యూషన్ ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

నిర్మాణాలపై అప్రమత్తంగా ఉండాలి

తగరపువలస: కొత్తగా భవన నిర్మాణాలు జరిగేచోట సంబంధిత సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా లేదా పరిశీలించాలని భీమిలి జెడ్సీ బొడ్డేపల్లి రాము సూచించారు. సోమవారం ఆయన భీమిలి జోన్ రెండో వార్డు ఊళ్లపేట, అనిల్ ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రి రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఊళ్లపేటలో నిర్మాణదారుడు సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం చేపట్టడాన్ని తప్పుపట్టారు. సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇష్టం వచ్చినట్టు నిర్మాణాలు చేపడుతున్నారు న్నారు. అలాగే అనిల్ నీరుకొండ ఆస్పత్రి ముందు రూ.16 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ అసంపూర్తిగా నిలిచిపోయిందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తగరపువలస ప్రైవేట్ మార్కెట్ సంతబయలు ప్రదేశంలో రహదారికి అడ్డంగా గొయ్యితీసి వదిలేయడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, చిల్ల సూర్యనారాయణరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, సరగడ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీవీజీ రాజు సేవలు ఎనలేనివి

తగరపువలస: విజయనగరం సంస్థానాధీశులలో చివరి వ్యక్తి పీవీజీ రాజు వివిధ రంగాల్లో ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. సోమవారం పీవీజీ రాజు జయంతి సందర్భంగా భీమిలి పెద బజారులోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1958లో మాన్సాస్ ట్రస్టును స్థాపించి ఉత్తరాంధ్రలో అనేక విద్యాసంస్థలు నెలకొల్పారన్నారు. ఈ సందర్భంగా ఆగస్టులో జరిగే హిందీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, గత ఫిబ్రవరిలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనతో ప్రతిపక్షాలకు వణుకు



కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక తదితరులు

పీఎం పాలెం: జనరంజకంగా సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రతిపక్షాలకు వణుకు పుట్టిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇంతకన్నా మెరుగైన పాలన దేశంలోని ఏ రాష్ట్ర ప్రజలకూ అందడం లేదన్నారు. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 6వ వార్డు పరిధి శంభువానిపాలెం గిరిజన గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన, కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక పాల్గొన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరూ అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్థానిక పారిశుధ్య సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

స్థానిక సచివాలయ సిబ్బంది గ్రామంలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కే 3 కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మధురవాడ జెడ్సీ కనక మహాలక్ష్మి, 6, 7 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు గాదె రోశిరెడ్డి, వంకాయల మారుతీ ప్రసాద్, సియాద్రి కనకరాజు, పోతిన యల్లాజీ, సాయికుమార్, జామి శివకుమార్ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను వెంటాడుతున్న వర్షం



పొలంలో తడిసిన మొక్కజొన్న

పద్మనాభం: మొక్కజొన్న రైతును వర్షం వెంటాడుతోంది. కృష్ణాపురం, పాండ్రంగి, మద్ది, పద్మనాభం, బాందేవుపురం గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట పక్వానికి రావడంతో పొలాల్లో ఎండబెట్టారు. సోమవారం వర్షం కురవడంతో పంట మొత్తం తడిసిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆడించడానికి సిద్ధమవుతున్న తరుణంలో తడిసిపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. గతకొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో మొక్కజొన్న పొత్తులు తడిసిపోయి గింజలు రంగు మారిపోతున్నాయని వాపోతున్నారు.

5 నుంచి విశేష హోమాలు

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శ్రీ రామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5వ తేదీ నుంచి మూడు రోజులపాటు విశేష హోమాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక ధర్మకర్త ధనుంజయరావు, త్రిమూర్తులు రాజు తెలిపారు. లోక కల్యాణార్థం విజయవాడ ఓంకార్ పీఠాధిపతులు ప్రమణిస్వామి నేతృత్వంలో కందుకూరి బాల సుబ్రమణ్యశర్మ, పుప్రీపు సాయికృష్ణ ఆధ్వర్యంలో శ్రీ చండీ, శ్రీ రుద్ర, నక్షత్ర, నవగ్రహ, శ్రీ సుదర్శన హోమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు పాల్గొన్నారు.

'ఎడుస్కిల్స్'తో అవగాహన ఒప్పందం

కొమ్మాది: ఇండస్ట్రీ – 4.0 అవసరాలకు తగినవిధంగా ఇంజినీరింగు యువతలో డిజిటల్ నైపుణ్యాలు పెంచడానికి ప్రముఖ సంస్థ ఎడుస్కిల్స్ ఫౌండేషన్‌తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని అకడమిక్ ప్రో వీసీ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ తెలిపారు. పరిశ్రమ అవసరాలను గుర్తించి, అందుకు తగిన విధంగా నైపుణ్యాలు పెంచే ఉద్దేశంతో గీతం ప్రణాళికాయుతంగా పని చేస్తుందని వెల్లడించారు.

సీబీసీటీ పరిజ్ఞానంపై వర్క్‌షాప్

కొమ్మాది: తల, మెడ ప్రాంతాల్లో తలెత్తే సమస్యలు, దంత వైద్య విధానంలో అవసరమైన డయాగ్నస్టిక్ పరిశీలనపై గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో కోన్‌బీమ్ కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీబీసీటీ)పై జాతీయ స్థాయి వర్క్‌షాప్ సోమవారం నిర్వహించారు. దంత కళాశాల ఓరల్ మెడిసన్, రేడియాలజీ విభాగం నిర్వహించిన వర్క్‌షాప్‌కు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వంద మందికి పైగా వైద్యులు హాజరయ్యారు.

మాధవునికి పంచామృతాభిషేకాలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో సోమవారం శుద్ధ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామిని ఐదు గంటలకు సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామికి పంచామృత అభిషేకాలు చేశారు. తదుపరి నిత్య అర్చన జరిపారు. పద్మనాభంతోపాటు పరిసర గ్రామాలైన కృష్ణాపురం, మద్ది, రెడ్డిపల్లి, విలాస్కాన్‌పాలెం గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

బాలికా విద్యకు ప్రోత్సాహం

తగరపువలస: ఆడపిల్లలే ఇంటి మహాలక్ష్ములని, వారు చదువుకుంటే కుటుంబం మొత్తం చదుకున్నట్టేనని చిట్టివలస శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ సిద్ధాబత్తుల వెంకటరావు అన్నారు. స్కూల్ 43వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము బాలికా విద్యకు ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను సెల్‌ఫోన్ల నుంచి దూరంగా ఉంచాలని కోరారు. అనంతరం స్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు వబ్బిలిరెడ్డి మురళి, ఎస్.అనురాగలత, ఎస్.చైతన్య స్రవంతి, ఎస్.కనకదుర్గ తదితరులు కరస్పాండెంట్‌ను సత్కరించారు. పాఠశాల యాజమాన్యం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించింది. చివరగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి మార్షల్ ఆర్ట్స్, కరాటేలో ఉచిత శిక్షణ

తగరపువలస: ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్, పీఎస్‌ఆర్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా మంగళవారం నుంచి ఈ నెల 31 వరకు మార్షల్ ఆర్ట్స్, కరాటేలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఔత్సాహికులైన విద్యార్థులు జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నారు. వివరాలకు కోచ్‌లు బంగారు పరదేశి 83095 48336, గౌతం 79897 40974ను సంప్రదించాలని కోరారు.

రాస పోలమాంబ అనుపోత్సవం నేడు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస శ్రీరాస పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం మంగళవారం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు పాలధార అనంతరం రథోత్సవం, రాత్రి 9 గంటలకు శోభాయాత్రతో అనుపోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో పులివేషాలు, నేలవేషాలు, కోలాటం ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంతో పాటు చుట్టుపక్కల ఉత్సవంలో పాల్గొనే గ్రామాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. సోమవారం తొలేళ్ల సందర్భంగా భారీగా బాణసంచా వెలిగించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

'రామలింగేశ్వర ట్రస్ట్ స్థలం పరిరక్షించాలి'



మాట్లాడుతున్న ట్రస్ట్ ఫౌండర్ ధనుంజయరావు, జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ అప్పారావు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మిథిలాపురి వుడా కాలనీలో గల శ్రీ రామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్‌కి చెందిన స్థలం పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ట్రస్ట్ సభ్యులు, కాలనీ వాసులు, కార్పొరేటర్ కోరారు. ఈ మేరకు సోమవారం రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మీడియా సమావేశంలో ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ మహావ్రతయాజుల ధనుంజయరావు మాట్లాడారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు. 286 పి, 287 పి, 300పిలో ఆలయం పక్కన ఉన్న 1300 గజాల స్థలాన్ని మిథిలాపురి ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు 2003లో కాలనీవాసుల సామాజిక అవసరాలు, కల్యాణ మండపం నిర్మాణం కోసం వుడా కేటాయించిందన్నారు. తర్వాత వచ్చిన సమస్యలు అప్పటి ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి చొరవతో పరిష్కారమయ్యాయన్నారు. సెప్టెంబర్ 2023లో సమాచార హక్కు చట్టం కింద ప్రశ్నించగా సదరు స్థలం శ్రీ రామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్‌కి కేటాయించినట్టు వుడా అధికారులు లిఖిత పూర్వకంగా ధ్రువీకరించారన్నారు. అప్పటి నుంచి ఆ స్థలం కాలనీ సామాజిక అవసరాలతోపాటు ఆలయ ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నామన్నారు. ఇటీవల ఆ స్థలం రాజేష్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడని, రూ.5 కోట్ల బ్యాంకు రుణం మంజూరు చేయాలని కోరడంతో పరిశీలనకు వచ్చామని ఏక్సిస్ బ్యాంకు మేనేజర్ చెప్పడంతో తాము ఆందోళనకు గురయ్యామన్నారు. ఆ స్థలంలో హోమం నిర్వహణకు యాగశాల నిర్మిస్తుండగా మన్మథరావు అనే వ్యక్తి వుడా ఆఫీసు నుంచి మాట్లాడుతున్నానని, యాగశాల తొలగించాలని ఆదివారం హుకుం జారీ చేసినట్టు చెప్పారు. పైగా కొందరు వ్యక్తులు తనను తీవ్రంగా బెదిరిస్తున్నట్టు ధనుంజయరావు వాపోయారు. 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు మాట్లాడుతూ స్థలం పరిరక్షణకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. తనకు తెలిసినప్పటి నుంచి కూడా అది ఆలయం స్థలం అని చెప్పారు. ఈ విషయం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రిమూర్తులు రాజు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వెండి బిందెల బహూకరణ



శ్రీవారికి వెండి బిందెలు సమర్పిస్తున్న దాతలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి నగరానికి చెందిన అభిరుచి రామకృష్ణ సుమారు రూ. 2.20 లక్షల విలువ చేసే వెండి బిందెలు సోమవారం బహూకరించారు. అదేవిధంగా పూలంగి సేవకు పుష్పాలు సమకూర్చేందుకు రూ.12 వేల నగదు అందజేశారు. ముందుగా మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో వెండి బిందెలతో పూజలు నిర్వహించి శ్రీవారికి సమర్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు, పి.రామకృష్ణారావు, ప్రమోద్, పద్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

చక్కగా చదివితే మంచి ఉద్యోగాలు



ఉద్యోగం పొందిన విద్యార్థినికి నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: విద్యార్థినులు చక్కగా చదువుకుంటే అందరికీ మంచి ఉద్యోగాలు వస్తాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద సోమవారం స్టూడెంట్స్ జాబ్ అచీవర్స్ డే (ఉద్యోగ విజయోత్సవం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చదువుకున్న వారికి మంచి ఉద్యోగాలు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో సరైన విద్య అందదన్న అపోహలు చాలా మందికి ఉన్నాయని, అందులో ఏమాత్రం నిజం లేదన్నారు.

అనంతరం 16 మందికి ఉద్యోగాలు రాగా వారికి ఆయన నియామకపత్రాలు అందించారు. కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.మురళీకృష్ణ, ఎంపీడీవో వెంకటరమణ పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు

భీమునిపట్నం: మానవ హక్కులపై త్వరలో అన్ని ప్రాంతాల్లోనూ అవగాహన కల్పిస్తామని మానవ హక్కుల రాష్ట్ర కౌన్సిల్ అధ్యక్షుడు పోలుమహంతి జగన్‌మోహన్‌రావు అన్నారు. మానవహక్కుల కౌన్సిల్ నూతన కార్యవర్గ ఏర్పాటు, సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యక్షులుగా మాధవి గణపతి, కార్యదర్శిగా మంత్రి శ్యాంప్రసాద్, కోశాధికారిగా కనుగుల దుర్గా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా వైకుంఠరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రావాడ నాయుడు, కార్యనిర్వాహక సభ్యులుగా వెంకటరమణ, ముసునూరి సూర్య శ్రీనివాస్, ప్రశాంత్, చక్రవర్తి బాధ్యతలు స్వీకరించారు. భీమిలి ప్రాంత కౌన్సిల్ సభ్యులు కాళ్ల సన్నీ, కంచకర్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అరుణ పతాకం రెపరెపలు



జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు



మే డే వేడుకల్లో శ్రీవిశ్వకర్మ కార్పెంటర్స్ సంక్షేమ సేవా సంఘం సభ్యులు

తగరపువలస: భీమిలి డివిజన్‌లో సోమవారం కార్మిక దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. చిట్టివలసలో ఆటో, అంగన్‌వాడీ, ముఠా, తోపుడుబండ్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు. వేడుకల్లో ఆర్.ఎస్.ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, కె.నాగరాణి, నీలాతి రాము, పెంట రాజు, నమ్మి నాయుడు, పంపాన సూర్యనారాయణ, దామోదర బాబాజీ, భాగం లక్ష్మి, సోమి వెంకట్, ఇంటి రాంబాబు పాల్గొన్నారు.

- భీమిలి రోడ్డులోని శ్రీవిశ్వకర్మ కార్పెంటర్స్ సంక్షేమ సేవా సంఘం నిర్వహించిన మేడే వేడుకల్లో అధ్యక్షుడు కనిమెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం నియమించారు. అధ్యక్షునిగా కోసూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా గిడిజాల బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శిగా ఎడ్లపల్లి రాంబాబు, సహాయ కార్యదర్శిగా చిల్ల చెన్నారెడ్డి, కోశాధికారిగా కనిమెట్ట రాము, సహాయ కోశాధికారిగా తమ్మిన అప్పారావు, గౌరవ అధ్యక్షునిగా జగుపల్లి వెంకట రమణ నియమితులయ్యారు. సింగిడి అప్పారావు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, కోసూరి శ్రీరామమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పక్షవాతంతో బాధపడుతున్న కార్పెంటర్ ముసినాడ రమేష్‌కు నిత్యావసర సరకులు అందించారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో కార్మిక దినోత్సవం సందర్భంగా మే డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు జెండా ఆవిష్కరించి, ప్రసంగించారు. ఉప్పులూరి గోపి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- శ్రీ దుర్గా భవానీ భవన నిర్మాణ శ్రామిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొమ్మాది సాయిరాం కాలనీ నుంచి ఇసుకతోట వరకు సంఘ సభ్యులు, కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వైఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు బి.సింహాచలం పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొమ్మాది కూడలి, మధురవాడ, శివశక్తినగర్, వుడా కాలనీ ప్రాంతాల్లోని సీఐటీయూ, ఏఐటీయూసీ కార్యాలయాల్లో అరుణ పతాకావిష్కరణ చేశారు.

PUBLIC NOTICE

పబ్లిక్, పోలీసు, రెవిన్యూ యావన్మందికి తెలియచేయునది ఏమనగా భీమిలిలోని I ADDL. JUNIOR CIVIL JUDGE COURT వారు IA 5/2023 IN OS 18/2023లో చిట్టివలస జ్యూట్ మిల్స్ వారిపై Schedule Property S.No. 11/2లో AC.4.40 centsలోని **East:** Boggu Street, **West:** Nataraj Layout, **North:** L.M.Church, S. Kruparao and S.S. Prabhudas Houses, **South:** Perike Street Houses మధ్యలోని AC.2.05 Centsపై Exparte ad-interim injunction grant చేసియున్నారు, ఎంక్వయిరీ తరువాత Both Partiesని "status quo maintain" చేయమన్నారు. పై దావాతాలుకా propertyపై ఎటువంటి లావాదేవీలు చేయకూడదు, అవి చట్టప్రకారం చెల్లవు, అవి నేరపూరితమైనవిగా పరిగణిస్తారు మరియు S.No. 11/2లో AC.4.40 centsపై 1930 నుండి సుమారుగా 25 Civil మరియు Criminal కేసులు (OS 220/1931, AS 129/1932, OS 142/1975, AS 290/1978, CC 87/1976, OS 28/1981, AS 121/1982, CC 1265/2000, High Courtలో CRP 3935/1988, WP 2276/2003, OS 296/2022, OS 542/2022, OS 543/2022, OS 640/2022, OS 260/2022) వున్నవి, అందుచేత ఎవరైనా జ్యూట్ మిల్స్ వారితో ఎటువంటి లావాదేవీలు చేసిన మరియు చేయబోయిన అవి చెల్లవు కనుక మోసపోవద్దు అని విన్నపం.

చెరుకు మేరీ నిర్మలజ్యోతి & చెరుకు విజయ్‌కుమార్ తరపున
KRUPAVARAM PEDAPATI
Advocate, Visakhapatnam.
Cell No. 7702218999